క్లుప్తంగా

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు విడుదల చేసిన నోటిఫికేషన్ గడువు శనివారంతో ముగిసినట్లు సీడీపీఓ హెచ్.కె.కామాక్షి తెలిపారు. ఈ ప్రాజెక్టు పరిధిలో ఎన్నో ఏళ్లు నుంచి ఖాళీగా ఉన్న కార్యకర్త, సహాయకులు, మినీ కార్యకర్త పోస్టులకు ప్రభుత్వం ఓపెన్ కేటగిరికి కేటాయించిందన్నారు. దీంట్లో భాగంగా సారవకోట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో 10 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామని, అన్ని కేంద్రాలకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు 87 దరఖాస్తులు

నరసన్నపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 19 పోస్టుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా.. 87 దరఖాస్తులు వచ్చాయని పీఓ నాగమణి తెలిపారు. శనివారంతో దరఖాస్తులకు గడువు ముగిసింది. సాయంత్రం ఐదు గంటల కల్లా 87 దరఖాస్తులు వచ్చాయన్నారు. సోమవారం ఏయే పోస్టుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయనేది తెలియజేస్తామని, సంబంధిత దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలకు పిలుస్తామన్నారు.

507 మందికి ఓటు హక్కు

ఎల్.ఎన్.పేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 507 మంది ఓటు హక్కును పొందారని తహసీల్దార్ బి.ఎ స్.ఎస్.సత్యనారాయణ శనివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. గతంలో ఓటు హక్కు పొందిన వారు 491 మంది కాగా.. ఈ నెల 13వ తేదీ వరకు మూడు రోజులపాటు ఇచ్చిన గడువులో మరో 16 మంది ఓటు హక్కును పొందారని వివరించారు. మొత్తం 507 మంది ఓటర్లకు గాను పురుషులు 372 మంది, మహిళలు 135 మంది ఉన్నారన్నారు.

ఆశాజనకంగా చోడి సాగు



బొర్రంపేట ప్రాంతంలో వేసిన చోడి పంట

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో రబీలో సాగుచేసే చోడి (రాగులు) పంట ఆశాజనకంగా ఉంది. సాగునీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వేసవి పంటగా చోడిని సాగు చేస్తుంటారు. మండలంలోని బొర్రంపేట, దబ్బపాడు, సిద్ధాంతం, బరటాం, మిరియాపల్లి, బసవరాజుపేట, లక్ష్మీనర్సుపేట తదితర గ్రామాల్లో చోడి పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తాయని రైతులు అంటున్నారు.

ఆటో డ్రైవర్ మృతి

బూర్జ: మండలంలోని కొరగాం బస్టాండ్ కూడలి డౌన్‌లో శనివారం రాత్రి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ హరిశెట్టి సుబ్రహ్మణ్యం (35) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. పాలకొండ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆటో కొరగాం బస్టాండ్ కూడలి వద్ద అదుపు తప్పి తిరగబడింది. అపస్మారక స్థితిలో ఉన్న డ్రైవర్‌ను అటుగా వెళ్తుతున్న ప్రయాణికులు గమనించి 108 వాహనానికి సమాచారం తెలియజేశారు.

సిబ్బంది వచ్చి ఆమదాలవలసలోని జొన్నవలస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి, ఉన్నత వైద్య సేవల నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. మార్గంమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునిది శ్రీకాకుళం పట్టణంలోని కృష్ణా పార్కు సమీప నివాసిగా గుర్తించారు. మృతుడికి భార్య అశ్విని, కుమారుడు ఉన్నారు. వైద్య సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.



పొందూరు: కృష్ణాపురం శివాలయంలో ప్రవచనాలు వింటున్న భక్తులు



హిరమండలం: చిన్నకోరాదలోని ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



సారవకోట: అంగూరు కుంభేశ్వర స్వామి ఆలయానికి బారులు తీరిన భక్తులు

హరహర మహాదేవ

- కిటకిటలాడిన ఆలయాలు
- మార్మోగిన శివనామస్మరణ



పాతపట్నం: వంగర మండలంలోని సంగమేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు: శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శనివారం ప్రసిద్ధ శైవక్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి. ప్రధాన వీధులు, ఆలయ ప్రాంగణాలు శివనామ స్మరణతో మార్మోగాయి. కొన్ని దశాబ్దాల తర్వాత శనిత్రయోదశి, శివరాత్రి ఒకేరోజు రావడంతో వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కొన్నిచోట్ల నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, శివపార్వతుల కల్యాణోత్సవం చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

గర్భగుడిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శివోహం



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివరాత్రి సందర్భంగా శివనామస్మరణతో మారుమ్మోగింది. శనివారం వేకువ జాము మూడు గంటల నుంచి స్వామి వారికి సుప్రభాత సేవతో పూజలు నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త పర్లాఖిముండి మహారాణి కల్యాణి గజపతి వర్మ పేరిట స్వామి వారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు చేశారు. స్వామివారిని శాసన సభాపతి తమ్మినేని సీతారాం, కుటుంబ సభ్యులు, జిల్లా కలెక్టర్ లాఠేష్ శ్రీకేష్ బి.లాఠ్కర్ దంపతులు, ఎస్పీ జీఆర్ రాధిక దంపతులు, శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి, కమిటీ మెంబర్లు సవర శైలజ, ధనలక్ష్మి, పుట్ట ఆదిలక్ష్మి, లాడి రమేష్‌గుప్తా, ఎంపీపీ వాన గోపి, స్థానిక సర్పంచ్ టి.సతీష్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, తహసీల్దార్ సత్యం, అర్చకులు పాల్గొన్నారు. డీఎస్పీ శివరామిరెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. నగిరికటకాం, కొమనాపల్లి సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు పైడిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో ఓంద్రుజ్వాల, బుడితి, అచ్యుతాపురం, లింగంన్నాయడుపేట గ్రామాల సాయి భక్తులు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.



శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ



పొందూరు: కృష్ణాపురం శివాలయంలో స్పటిక శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



ఆమదాలవలస రూరల్: శ్రీనివాసాచార్యులపేటలో శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



బూర్జ: లక్కుపురం శివాలయంలో వేచి ఉన్న భక్తులు



సరుబుజ్జిలి: దంతపురి భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో క్షీరాభిషేకాలు



ఆమదాలవలస:ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తూరు: కృష్ణాపురం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఎల్.ఎన్.పేట: శ్యామలాపురం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సారవకోట: తొగిరిలో జ్ఞాన ప్రసన్నాంబికాదేవి ఉత్సవ మూర్తులను తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



మెళియాపుట్టి: పెద్దమడి ఆకులమ్మ వారి ఆలయంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



నరసన్నపేట: దుర్గామల్లికార్జున స్వామి ఆలయం వద్ద ఉన్న శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



నరసన్నపేట: దేశవానిపేట వద్ద భక్తులతో కిటకిటలాడుతున్న ఉమారామలింగేశ్వరాలయం



నరసన్నపేట: హోంశాంతి భవనంలో పూజలు చేస్తున్న బ్రహ్మకుమారీలు, సభ్యులు



ఆమదాలవలస రూరల్: అక్కులపేటలో రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు



పాతపట్నం: జోగీశ్వరాలయం ఆలయ దర్శనానికి కొండపైకి ఎక్కుతున్న భక్తులు



కొత్తూరు: కర్లెమ్మ నవగ్రహాల ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు మెమొంటో అందజేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న ధర్మాన ప్రీమియర్ లీగ్–4 క్రికెట్ టోర్నమెంట్ (డే అండ్ నైట్) ఉత్సాహంగా జరిగింది. మొత్తం 46 జట్లు పాల్గొనగా నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా క్రికెట్ పోటీలు ఆర్ఎస్ఏ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తుంది. శనివారం రాత్రి ఈ పోటీలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ తిలకించారు. నరసన్నపేట ఆర్ఎస్ఏ జట్టు సభ్యునికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ మొమొంటోను కృష్ణచైతన్య అందజేశారు. వేకువ జామున ఫైనల్ పోటీలు నిర్వహిస్తారు. ఆదివారం బహుమతులు అందజేయనున్నారు.

చిరుజల్లులు..



తురకపేట ప్రాంతంలో ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్‌లు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం చిరు జల్లులు కురిశాయి. ఇప్పటికే నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను రైతులు కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు. బొర్రంపేట, ముంగెన్నపాడు రోడ్డు, కోవిలాం కాలనీ, మల్లికార్జునపుట గ్రామాల సమీపంలో ఇటుకల తయారీదారులకు నష్టం కలిగింది. వాణిజ్య పంటలైన మొక్కజొన్న, మిరప వంటి పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగ పడిందని పలువురు రైతులు చెబుతున్నారు.



బొర్రంపేట వద్ద ఇటుకలపై కప్పిన టార్పాలిన్

విద్యుత్ సమస్య పరిష్కారం

కొత్తూరు: గురండి గ్రామంలో విద్యుత్ డీపీని సర్పంచ్ బోర సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. గ్రామంలో డీపీ లేకపోవడంతో లోఓల్టేజ్ సమస్యతోపాటు పంచాయతీకి చెందిన తాగునీటి పథకం మోటార్ గృహాలకు ఉన్న మోటార్లు తిరగకపోవడంతో సర్పంచ్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో డీపీని మంజూరు చేశారు. వెంటనే గ్రామ సచివాలయం లైన్‌మన్ సహకారంతో డీపీని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన యువకులు కిరణ్, తిరుపతిరావు, నరసింహం, జనార్దన, ఉమ, మధు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



డీపీని ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది, గ్రామస్తులు